నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 17 నవంబర్ 2024 | SIDDIPET

రైతు సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్

రామాయంపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం
- బీఆర్ఎస్ మెదక్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, నవంబర్ 16: అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ జిల్లా రామాయంపేటలో బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. రైతుభరోసా ఇవ్వకుండా, పంట రుణమాఫీ సరిగ్గా చేయక, ధాన్యం కొనకుండా రేవంత్ సర్కార్ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి చేయూత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులకు మధ్య సఖ్యత లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క పథకం అమలుపర్చడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన అల్లుడి కాంట్రాక్టుల కోసం ఢిల్లీకి, హైదరాబాద్‌కు తిరుగుతున్నాడే తప్ప రాష్ట్ర అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు పూర్తి న్యాయం చేసింది కేవలం బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, రామాయంపేట ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, ఉమామహేశ్, సుభాష్, సిద్ధరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కాట్రియాల శాములు, సురేష్, నరేందర్ రెడ్డి, కిషన్, స్వామి, బాలరాజు, చింతల రాములు తదితరులు ఉన్నారు.

సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో యాసంగి సాగుకు నారు పోసిన రైతులు

యాసంగి సాగుకు పొలం దున్నకం చేస్తున్న రైతు

రైతుభరోసా ఏమాయే!

వానకాలం సాగుకు పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు

- యాసంగి సాగుకు ప్రభుత్వం నుంచి ప్రకటన కరువు
- ఇప్పటికే యాసంగి సాగు పనులు షురూ
- పెట్టుబడుల కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కర్షకలోకం ఆగ్రహం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో వేల మందికి వర్తించని పంట రుణమాఫీ

సిద్దిపేట, నవంబర్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో యాసంగి సాగు పనులు షూరు అయ్యాయి. రైతులు నారుమడులకు దున్నకాలు ప్రారంభించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాపై క్లారిటీ ఇవ్వడం లేదు. ఇప్పటికే వానకాలం పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టింది. గత యాసంగిలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధంచేసిన డబ్బులను విడుదల చేసి చేతులు దులుపుకొంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు ఒక పంటకు రూ. 5వేల చొప్పున రైతుబంధు ఇచ్చింది. తాము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ. 7,500 చొప్పున రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 9తో ఏడాది పూర్తికానున్నది. రైతులకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చడం లేదు. రూ.2 లక్షల పంట రుణమాఫీ అని చెప్పి సగం మందికి మాత్రమే చేసి మిగతా రైతులకు చెయ్యిచ్చింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో యాసంగి పనులు ప్రారంభం...

పాత మెదక్ జిల్లాలోని ప్రస్తుత సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో యాసంగి పనులను రైతులు ప్రారంభించారు. ఈసారి యాసంగిలో సిద్దిపేట జిల్లాలో అన్ని పంటలు కలిపి 3.82 లక్షల్లో ఎకరాల్లో సాగుకానున్నాయని, ఇందులో వరి 3.48లక్షల ఎకరాల్లో సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. మెదక్ జిల్లాలో అన్ని పంటలు కలిపి 2.84లక్షల ఎకరాలు, ఇందులో వరి 2.65 లక్షల ఎకరాలు సాగు చేయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో అన్ని పంటలు కలిపి 2,01,193 ఎకరాలు అంచనా వేశారు. ఇందులో వరి 1.10 లక్షల ఎకరాల్లో, జొన్న 59 వేల ఎకరాలు, శనగ 20 వేలు, మిగతా ఇతర పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే వానకాలం పంటలను అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎక్కువశాతం రైతులు దళారులకు తమ ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రభుత్వం ధాన్యం సేకరణలో తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో రైతులు వ్యాపారులను ఆశ్రయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొన్నారు. కొన్న 72 గంటల్లో నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితులు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వక పోవడంతో యాసంగి పెట్టుబడులకు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతుభరోసాపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కేసీఆర్ హయాంలో యాసంగి, వానకాలం సీజన్‌కు ప్రారంభానికి ముందే రైతుబంధు సాయం వేయడంతో అన్నదాతలకు ఎంతో అక్కరకు వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు చేయూత ఇవ్వక పోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

రుణమాఫీ కాకపాయే..

ఎన్నికల ముందు రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపింది. ఇక రైతుభరోసా ఏమిస్తదో అని రైతులు ఆశలు వదులుకుంటున్నారు. మే 2018లో కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.8 వేల చొప్పున అందించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు దానిని ఎకరాకు రూ. 5వేల చొప్పున పెంచి రెండు పంటలకు ఏడాదికి రూ.10 వేలను అందించారు. కేసీఆర్ 11 విడతల్లో రైతుబంధు సాయం అందించారు. సిద్దిపేట జిల్లాలో 3,20,921 మంది రైతులకు 313.96 కోట్లు, మెదక్ జిల్లాలో 2,60,104 మంది రైతులకు 194.90 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 3,60,320 మంది రైతులకు 376.02 కోట్ల రైతుబంధు అందించారు. 11 విడతల్లో సిద్దిపేట జిల్లాలో 29,33,494 మంది రైతులకు రూ. 3,124.82 కోట్లు, మెదక్ జిల్లాలో 24,69,637 రైతులకు రూ. 2,027.37 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 31,95,960 మంది రైతులకు రూ. 3,619.54 కోట్లు, మొత్తం ఉమ్మడి జిల్లాలో 85,99,091 మంది రైతులకు రూ. 8,771.73 కోట్లు రైతుబంధు కింద కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం, రైతుబీమా వంటి పథకాలతో రైతులకు చేయూతనిచ్చింది. ఇప్పుడు రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి అలాంటి చేయూత లభించక పోవడంతో సాగుకు తిప్పలు పడుతున్నారు.

భూమి కోసం దళితుల నిరసన

సిద్దిపేటలో భూమి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

- పూర్వకాలం నుంచి ఉన్న శ్మశాన వాటిక
- మూడు గుంటల భూమికి 280 గజాల భూమే మిగిలింది
- ఆ స్థలం తమకే కేటాయించాలి: దళితులు

సిద్దిపేట, నవంబర్ 16: సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో దళితుల భూమిని కబ్జా చేయాలని కొంతమంది నాయకులు ప్రయతిస్తున్నారని సిద్దిపేట మాల సదర్ సంఘం నాయకులు ఆరోపించారు. ఆ భూమి తమకే కేటాయించాలని శనివారం దళిత కుటుంబాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచి ఈ స్థలంలో దళితుల శ్మశాన వాటిక ఉండేదని వారు తెలిపారు. మూడు గుంటల భూమికి ప్రస్తుతం 280 గజాలు మాత్రమే మిగిలిందన్నారు. ఈ స్థలంలో మున్సిపాలిటీ బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. అంబేద్కర్ మాల సదర్ సంఘం పేరుతో బోర్డు ఏర్పాటు చేసి, దళిత నాయకులు నిర్మాణాలు చేపట్టారన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు ఈ భూమిపై సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి స్థలం తమకు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

క్రీడల్లోనూ రాణించాలి

చేగుంటలో క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో రాధాకిషన్, అయిత పరంజ్యోతి

- మెదక్ డీఈవో రాధాకిషన్

చేగుంట, నవంబర్ 16: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే కెరీర్ ఉజ్వలంగా ఉంటుందని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి అన్నారు. చేగుంట లోని ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ బాలబాలికల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68 క్రీడలను శనివారం జ్యోతి వెలిగించి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపిక కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎంఈవో నీరజ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, రాష్ట్ర యోగా కోచ్ కరణం గణేశ్‌కుమార్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పీఈటీలు అల్లి నరేశ్, ఎ.శంకర్, విష్ణు, డి.శంకర్, శ్రీనివాస్, శారద తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ కోఆర్డినేటర్‌గా నియామకం

నారాయణరావుపేట, నవంబర్ 16: తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కోఆర్డినేటర్‌గా సిద్దిపేటకు చెందిన బండోజు నరసింహచారిని నియమించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతపట్ల వెంకటచారి ఒక ప్రకటనలో తెలిపారు. బండోజు నరసింహచారి స్కూల్ అసిస్టెంట్ హిందీ పండిట్‌గా జడ్పీహెచ్ఎస్ నారాయణరావుపేటలో పనిచేస్తున్నారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, క్రీడలు యోగా, ఏదైనా ప్రత్యేకంగా చేయగలిగితే వారికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ నుంచి అవార్డు ఇస్తామని బండోజు నరసింహచారి తెలిపారు. ఆసక్తిగలవారు 15 రోజుల ముందు సెల్ నంబర్ 9849315321లో సంప్రదించాలని సూచించారు.

వేతన వెతలు

- గిరిజన ఆశ్రమ పాఠశాలల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు ఏడు నెలలుగా వేతనాలు లేవు
- భారమైన కుటుంబాల పోషణ
- కుటుంబాలకు దూరంగా విధులు
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్

బొమ్మారెడ్డిగూడెంలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల

చౌటకూర్, నవంబర్ 16: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు ఏడు నెలలుగా వేతనాలు లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ, పనిచేస్తున్న చోటనే నివాసముంటూ విద్యాబోధన చేస్తున్న వారికి సరైన గుర్తింపు కరువైంది. సంగారెడ్డి జిల్లాలోని హత్నూరలో బాలికలు, నారాయణఖేడ్‌లో బాలికలు, బాలుర, చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో వెయ్యి మంది వరకు విద్యార్థులు చదువుతుండగా, 34 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 339 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు పనిచేస్తున్నారు. వీరికి ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. విద్యార్థినీవిద్యార్థులకు రాత్రింబవళ్లు శ్రమించి విద్యా బోధన చేస్తున్నప్పటికీ తమ సేవలకు గుర్తింపు దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగ్గ ప్రయోజనం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పూర్తి స్థాయిలో తగిన విద్యార్హతలతో ఎంఏ, బీఈడీ, టెట్ పోటీ పరీక్ష రాసి ఉత్తీర్ణులవుతున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులకు తక్కువ కాకుండా వివిధ రకాల పోటీ పరీక్షలు రాసి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా ఎంపికయ్యారు. మారుమూల గిరిజన తండాల్లో రోడ్డు మార్గం లేని ప్రాంతాల్లో విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.45 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు జిల్లా స్థాయిలో మంచి ర్యాంకులు సంపాదించేలా వారిని తయారు చేస్తున్నారు. సమాయానికి వేతనాల్లేక కుటుంబాల పోషణ కష్టతరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మారెడ్డిగూడెంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో 8 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాత్రింబవళ్లు పని చేస్తున్నప్పటికీ నెలకు కేవలం రూ.12 వేల చొప్పున వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. అరకొర వేతనాన్ని కూడా ఏజెన్సీల ద్వారా చెల్లిస్తున్నారు. అందులోనూ కోతలు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు ఆవేదనకు గురవుతున్నారు. అన్నీ అర్హతలతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో రోస్టర్ విధానంలో ఎంపికైన వారికి గురుకుల పాఠశాల విధానం ద్వారా వేతనాన్ని రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తూ నిరుపేద గిరిజన విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న తమకు సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

కుల వృత్తులను ప్రోత్సహిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబర్ 16: కుల వృత్తులను ప్రోత్సహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని తిరుమల గార్డెన్‌లో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సరైన రక్షణ పరికరాలు లేక ఎంతోమంది గీత కార్మికులు తాటిచెట్టుపై నుంచి పడి మృత్యువాత పడటం, శాశ్వతంగా అంగవైకల్యం పొందడం జరుగుతోందన్నారు. వీటి నుంచి రక్షణకు గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విరివిగా తాటి, ఈత వనాలను పెంచి గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అర్హులైన గీత కార్మికులకు టూవీలర్లను అందజేస్తామన్నారు. ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలోని నర్సరీని పరిశీలిస్తున్న అజిత్ కుమార్ సాహూ

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఆదాయం

- కేంద్ర సంయుక్త కార్యదర్శి అజిత్‌కుమార్ సాహూ

ములుగు, నవంబర్ 16: రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను అందించి మంచి దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలని నూనె గింజల విభాగం కేంద్రం సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్ సాహూ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని ఆయిల్‌పామ్ నర్సరీ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని కలెక్టర్ మనుచౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయిల్‌పామ్ పెంపకం చేసి రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రాబోయే కాలంలో ఆయిల్‌పామ్ గింజలకు మరింత డిమాండ్ పెరుగుతుందని, సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందిస్తాయని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అనంతరం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ సందర్శించి, నర్సరీలోని మొక్కల సాగు విధానాన్ని అజిత్ కుమార్ సాహూ పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారిణి సువర్ణ, ఉద్యానశాఖ అధికారులు, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిదులు ఉన్నారు.

శాకారం, గౌరారంలో ఆయిల్‌పామ్‌పై అవగాహన

వర్గల్, నవంబర్ 16: వర్గల్ మండలంలోని శాకారం,గౌరారం గ్రామాల్లో రైతులు వేలూరి కృష్ణారెడ్డి, అభిమన్యూకుమార్‌రెడ్డి సాగుచేస్తున్న ఆయిల్ తోటలను కేంద్ర నూనెగింజల ఉత్పత్తి విభాగం సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్‌సాహో పరిశీలించారు. డ్రిప్ సిస్టమ్ ద్వారా నీటిని పొదుపు చేస్తూ అంతర పంటలు సాగును చేస్తున్న తీరును పరిశీలించి సూచనలు అందజేశారు. మనదేశం 75శాతం నూనెగింజలను దిగుమతి చేసకుంటున్నదని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడం ద్వారా రాబోయే రోజుల్లో మనమే ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుతామని తెలిపారు. అంతర పంటలుగా బొప్పాయి, అరటి, కూరగాయల సాగుచేస్తున్న శాకారం రైతు కిష్టారెడ్డిని అభినందించారు. ఆయన వెంట కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర ఉద్యానవన శాఖ జేడీ సరోజినిదేవి, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారిణి సువర్ణ, అధికారులు ఉన్నారు.

వర్గల్: గౌరారంలో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థిని ఆత్మహత్యతో ఉద్రిక్తత

- గురుకులం ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- బిడ్డ మృతిపై తల్లి అనుమానం
- సమగ్ర విచారణకు డిమాండ్

కొత్తాపూర్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విచారణ జరుపుతున్న ఆర్డీవో రవీందర్ రెడ్డి, మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య విద్యార్థిని స్వాతి (ఫైల్)

సంగారెడ్డి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని కొత్తాపూర్ బీసీ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం తొమ్మిదో తరగతి విద్యార్థి టి.స్వాతి(14) తరగతి గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్వాతి మృతిపై ఆమె కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేపట్టాలని తల్లి దివ్యవాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురుకుల పాఠశాల సిబ్బంది తమ కూతురును చంపారని ఆమె ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి స్వాతి కుటుంబ సభ్యులు గురుకుల పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. డీఎస్పీ సత్తయ్య నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. గురుకుల పాఠశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. మానసిక ఒత్తిడితోనే స్వాతి ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ సత్తయ్య తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వేకువజామున చున్నీతో ఉరివేసుకున్న స్వాతి

హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన టి.స్వాతి(14) సంగారెడ్డి మండలం కొత్తాపూర్‌లోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. ఈమె చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నది. స్వాతి శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత విద్యార్థులతో కలిసి బాగానే గడిపింది. శనివారం స్వయంపాలన దినోత్సవం ఉండడంతో సహా విద్యార్థులతో కలిసి డ్యాన్స్ ప్రాక్టీస్‌లో పాల్గొంది. శనివారం ఉదయం 5గంటలకు లేచిన స్వాతి రూల్‌కాల్ అనంతరం రెండవ అంతస్తులో తన తరగతి గదిలోకి వెళ్లింది. తరగతి గదిలోకి వెళ్తున్న ఆమెను ప్రశ్నించగా చిన్నపని ఉన్నట్లు చెప్పి వెళ్లింది. అలా వెళ్లిన స్వాతి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. తరగతిగదిలోకి వెళ్లిన స్వాతి ఎంతకూ తిరిగి రాకపోవటంతో విద్యార్థినులు నాగరాణి, సంజన, లాస్యప్రియ రెండో అంతస్తులోని తరగతి గది లోకి వెళ్లి కిటికీలోంచి చూడగా స్వాతి ఉరివేసుకుని కనిపించింది. దీంతో విషయాన్ని వెంటనే పీడీ సుజాత దృష్టికి తీసుకెళ్లారు. పీడీ, ఇతర సిబ్బంది వచ్చి గది తలుపును బద్దలు కొట్టారు. అప్పటికే స్వాతి మృతిచెందడంతో విషయాన్ని ప్రిన్సిపాల్ స్రవంతి దృష్టికి తీసుకెళ్లారు. స్రవంతి సంగారెడ్డి రూరల్ పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు వచ్చారు. స్వాతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జనరల్ దవాఖానకు తరలించారు. స్వాతి ధైర్యవంతురాలు, మంచి విద్యార్థి అని, ఇలా ఆత్మహత్య చేసుకోవడం తమను దిగ్భ్రాంతికి గురిచేసినట్లు ప్రిన్సిపాల్ స్రవంతి తెలియజేశారు. స్వాతితో కలిసి చదువుకుంటున్న విద్యార్థులు లాస్యప్రియ, సంజన మాట్లాడుతూ.. స్వాతి రాత్రి పడుకునే వరకు బాగుందని, తనకు ఒంటరిగా ఉండాలనిపిస్తున్నదని తమతో చెప్పిందన్నారు. స్వాతి ఆత్మహత్య చేసుకోవడం నమ్మలేకపోతున్నట్లు విచారణకు వచ్చిన ఆర్డీవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ సత్తయ్యకు ఇదేవిషయాన్ని తెలియజేశారు. డీఎస్పీ సత్తయ్య ఆధ్వర్యంలో సంగారెడ్డి రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. స్వాతి ఆత్మహత్య చేసుకున్న గదిలో క్లూస్‌టీమ్ ఆధారాలను సేకరించింది. స్వాతి పుస్తకాల్లో తన అక్క జానుకు రాసిన లేఖ దొరికిందని తెలిపారు. తన అక్క జాను జన్మదినం వరకు తాను జీవించి ఉంటానో లేదోనని స్వాతి లేఖలో రాసిందని చెప్పారు. స్వాతి మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని డీఎస్పీ సత్తయ్య తెలిపారు. స్వాతి మృతికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆర్డీవో రవీందర్‌రెడ్డి చెప్పారు. సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం అనంతరం స్వాతి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోస్టుమార్టం గది వద్ద కుటుంబీకులు నిరసనకు దిగారు. వీరికి సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు మద్దతుగా నిరసనలో పాల్గొని స్వాతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి తిరుపతి ప్రభుత్వ దవాఖాన వద్ద స్వాతి కుటుంబీకులను కలిసి సంతాపం తెలియజేశారు. స్వాతి కుటుంబీకులను ఆదుకుంటామని, ఆర్థిక సహాయం అందజేస్తామని హామీనిచ్చారు.